వైపు చూసి 'అమ్మా ఆ పటం ఎవరిది?' అన్నాడు. అమ్మాయిచూసి తక్షణమే అది 'శివాజీది' అన్నది.

'ఏమిటమ్మా' అలా అంటావు. సరిగా చెప్పు' అన్నాడు తాత బోసినవ్వుతో. 'తప్పు చెప్పానేమో నని, తిరిగిచూసి, 'అవునండీ అది శివాజీదే' కావాలంటే తీసుకొచ్చిచూపిస్తా' అని లేవబోయింది. 'వద్దులే' అంటూ 'పిచ్చిపిల్లా! ఆ పటం శివాజీది అంటావే. అది మందికదూ! ఇంతా మేము కొని, పటం కట్టించి భద్రంగా దాచుకుంటే, పుసిక్కిని శివాజీది అంటావే! ఇదేనా న్యాయ్యం! ఏమమ్మా చెప్పు ఇప్పుడైనా ఎవరిది?' అన్నాడు సీరియస్‌గా.

తర్వాత యిద్దరూ నవ్వు ఆపుకోలేక పోయారు.

ప్రసాద్

* * *

## అదీ ఆజ్ఞ

పూర్వమొక రాజుండేవాడు. ఆ రాజుకి ఒకనాడు భార్యల మాట ప్రకారం భర్తలు నడుచుకుంటున్నారా లేక భర్తలమాటప్రకారం భార్యలు నడుచుకుంటున్నారా అనే ధర్మసందేహము కల్గింది. దానినిగూర్చి రాజు మంత్రి నడిగేడు. మంత్రి తనభార్య మాటప్రకారం నడుచుకుంటున్నానని చెప్పి, తనలాగే అందరు భర్తలూ నడుచుకుంటున్నారని చెప్పేడు. "భార్యమాట వినే మొగుడేం మొగుడు" అని దీన్ని పరీక్షించాలనుకొని, రాజ్యంలో గల పెళ్లయిన మగవాళ్లనందరినీ పిలిపించి భార్యమాట వినేవారిని ఎడంప్రక్క నిలబడమన్నాడు. మిగతా వాళ్లని కుడిప్రక్కన నిలబడమన్నాడు. అందరూవచ్చి ఎడంప్రక్క నిలబడ్డారు కాని ఒకడు కుడిప్రక్కకి వచ్చేడు. అంత రాజు వానితో "అయితే నీభార్య నీ దాసి అన్నమాట" ఈమాటలు విని వాడు "మహారాజా! ఇదీ నాభార్య ఆజ్ఞే ఆమె నన్ను కుడిప్రక్కనిలబడమంది. అందుచే ఆమె ఆజ్ఞ శిరసావహించేను" ఈ జవాబు విని రాజు విస్తుపోయేడు.

దూర్వాసుల సీతారామమూర్తి

## ఎదురుదెబ్బ లేక రిపార్టీ

శ్రీనివాసరావు, సుబ్రమణ్యం ఇద్దరు ఒకే రూములోవుండి చదువుకుంటున్నారు కాలేజిలో. సుబ్రహ్మణ్యానికి కవిగావాలన్న ఉద్దేశ్యం బాగా వుంది. అందుకనే స్పెషల్ తెలుగువున్నగ్రూపు తీసుకున్నాడు. ఇప్పుడిప్పుడు ఎవరితో మాట్లాడినా వ్యాకరణయుక్తంగా మాట్లాడడం మొదలెట్టాడు. శ్రీనివాసరావుకి యీ పద్ధతి సుతరామూ నచ్చలేదు. ఏదోవిధంగా సుబ్రహ్మణ్యానికి బుద్ధి చెప్పాలనుకున్నాడు.

ఆనాడు శ్రీనివాసరావు బజారునుండి రూముకి వచ్చేసరికి లోపల గడిబెట్టి వున్నది. ఇదివరకే శ్రీనివాసరావుకి సుబ్రహ్మణ్యంమీద కొంచెం అనుమానం. ఎందుకంటే, సుబ్రహ్మణ్యం రోజూ కూరగాయలమ్మాయితో సరససల్లాపాలాడటమే!

ఇంకేం! ఇవ్వాళ ఇలా తలుపుగడివేయడంతో శ్రీనివాసరావుకి అనుమానం మిక్కుటమైంది. సుబ్రహ్మణ్యాన్ని అవమానపరచడానికిదే అదననుకున్నాడు. పత్తేదారువలె పనిజేయాలనుకున్నాడు. ఎత్తైన వెనుక గోడ ఎగిరిదూకాడు. వెనుకవాకిలిదీసి లోనికెళ్ళాడు. గదిలో సుబ్రహ్మణ్యం లేదు. "తన ఊహ వట్టి అపోహ! తన కృషి నిరర్థకం" అనుకున్నాడు. గోడదూకడంతో తన కాలికి తగిలిన దెబ్బ యిప్పుడు నొప్పి బుట్టసాగింది.

ఇంతలో చేతిలో సోప్‌బాక్సు పైన తువ్వాళతో స్నానాలగదినుండి ప్రవేశించాడు సుబ్రహ్మణ్యం. గదిలో కూర్చునివున్న శ్రీనివాసరావుని చూడగానే ఆశ్చర్యంవేసింది.

"ఎటులొచ్చితివిరా?" అని ప్రశ్నించాడు.

"కాళ్లతో నడిచి" కొంటెగా జవాబిచ్చాడు శ్రీనివాసరావు.

"అదిగాదు మిత్రమా! నీవరుదెంచిన మార్గంబు నడుగుచుంటి" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అయితే అడుగు, దాన్నే అడుగు నాకేం!" అన్నాడు శ్రీనివాసరావు. ఈ జవాబుతో సుబ్రహ్మణ్యానికి కోపం వచ్చింది. శ్రీనివాసరావుని కించపరచాలన్న ఉద్దేశ్యంతో "అడిగితి" నన్నాడు.

"ఏమి నుడివినది?" అని ప్రశ్న వేశాడు శ్రీనివాసరావు. సుబ్రహ్మణ్యం గూడ శ్రీనివాసరావు నోటినుండి యీ ప్రశ్నే వస్తుందని వూహించాడు.

"నీవు వట్టి శుంఠవని నుడివినది" అన్నాడు సుబ్రహ్మణ్యం. ఈ దెబ్బతో శ్రీనివాసరావు ముఖం వెలవెలపోతుందనుకున్నాడు. కాని, అలా జరుగలేదు సరిగదా "ఇంకేం! నీవు వట్టి శుంఠవని నీకే చెప్పినదిగా!" అని ఎదురుదెబ్బ గొట్టాడు శ్రీనివాసరావు.

తాను గోడకేసికొట్టిన బంతి తిరిగి తనకేవచ్చి తగలడంతో సుబ్రహ్మణ్యం రసాతల పాతాళలోకానికి దిగజారాడు. శ్రీనివాసరావు ఎవరెస్టు శిఖరాగ్రానికి ఎగబ్రాకాడు.

అలపర్తి వెంకటసుబ్బారావు

* * *

## రుమాలు తెచ్చిన రభస

జగన్నాథం కాలేజీలో ఫస్టుఇయర్ క్లాసు చదువుతున్నాడు. యోగ్యమైన నడవడిగలవాడని పేరు సంపాదించుకున్నాడు. ఒకనాడు కాలేజీవరండాలో లేడీస్టూడెంట్సు క్లాసులోకి పోతున్నారు. మర్యాదగల జగన్నాథంగూడ క్లాసులోకి పోతూ వాళ్లనిచూచి కొంచెం ఆగేడు. ఒక లేడీస్టూడెంటు రుమాలు ఆసమయంలో క్రిందకు జారిపోయింది. మన జగన్నాథంగాడు ఆ రుమాలును తీసి గబగబా ముందుకువెళ్లి లేడిస్టూడెంటును పరికించుచూ, "మీరుమాలా!" అని మర్యాదగా అడిగాడు. కొంటెతనముగా ఆ లేడీస్టుడెంటు ఔను 'మాదిగా!' అంటూ లాక్కొని వెళ్లిపోయింది. జగన్నాథంకి ఏడవాలో నవ్వాలో తెలియక వెర్రిమొహంతో నిలబడిపోయాడు.

మోహన్‌కుమార్